ప్రతి గడపలో సంక్షేమం

- సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా మంత్రి కాకాణి కృషి
- ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం చూపిన 'గడప గడపకు మన ప్రభుత్వం'
- గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు



పొదలకూరు మండలం ముదిగేడులో మహిళకు ఇంటి స్థలం పట్టా అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి (ఫైల్)



మనుబోలులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి కాకాణి (ఫైల్)

పొదలకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని సర్వేపల్లి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విజయవంతంగా నిర్వహించి ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందాయా.. లేదా.. తెలుసుకోవడంతోపాటు పలు సాంకేతిక కారణాలతో పథకాలు అందని వారిని కూడా గుర్తించి వారికి పథకాలు అందేలా చర్యలు తీసుకున్నారు.

195 రోజులు.. 96 వేల కుటుంబాలు

సర్వేపల్లి నియోజకవర్గంలో 195 రోజులపాటు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించగా.. మంత్రి కాకాణి 96 వేల కుటుంబాలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అంతేకాక బడుగు బలహీన వర్గాల ప్రజలు నివసించే కాలనీలకు వెళ్లి అక్కడ మౌలిక సదుపాయాల లేకపోతే వెంటనే అధికారులతో మాట్లాడి సిమెంటు రోడ్లు, సైడ్ డ్రెయిన్ల తదితర మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకున్నారు. సాంకేతిక కారణాల వల్ల పరిష్కరించలేని సమస్యలు మినహా మిగిలిన వాటికి పరిష్కారం చూపారు. ప్రధానంగా రెవెన్యూశాఖ సమస్యలను పరిష్కారించగలిగారు. అలాగే విద్యుత్ స్తంభాలు, కొత్తగా విద్యుత్ తీగల ఏర్పాటు, సిమెంటు రోడ్లు, సైడ్ డ్రెయిన్లు, పక్కాఇళ్ల మంజూరు, కొత్తగా ఇంటి నివేశన స్థలాలు తదితర సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా మండలాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం పూర్తయ్యే లోపు ఆయా సమస్యలను పరిష్కరించగలిగారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ప్రజలు 4,257 అర్జీలను మంత్రి కాకాణికి అందజేయగా వాటిలో 2,654 అర్జీలను వెంటనే పరిష్కరించారు. పెండింగ్‌లో ఉన్న వినతిపత్రాలను పరిశీలించి అందులో 1,354 ఆయా శాఖల అధికారుల ద్వారా పరిష్కరించగారు. పరిష్కారానికి వీలు కాని 249 అర్జీలను మాత్రమే పక్కన పెట్టారు.

89 సచివాలయాలకు రూ.17.80 కోట్లు

'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం పూర్తయిన సచివాలయాల పరిధిలో సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షల వంతున అందజేసింది. సర్వేపల్లి నియోజకవర్గంలోని 89 సచివాలయాలకు కలిపి మొత్తం రూ.17.80 కోట్లు నిధులను ప్రభుత్వం మంజూరు చేయగా.. ఆ నిధులతో అవసరమైన చోట్ల సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్లు నిర్మించడంతోపాటు తాగునీటి అవసరాలకు ఖర్చు చేశారు. ఈ నిధులే కాక మంత్రి ప్రత్యేకంగా ఎంపీ ల్యాడ్స్, నుడా, ప్రభుత్వం నుంచి అదనపు నిధులను కూడా మంజూరు చేయించి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను చేయించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు ఎక్కడికక్కడ పరిష్కారం కావడంతోపాటు గ్రామల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతో నియోజకవర్గ ప్రజలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

సర్వేపల్లి నియోజకవర్గంలో..

గడపగడపకు మన ప్రభుత్వం	
నిర్వహించింది	- 195 రోజులు
వెళ్లిన గడపలు	- 96 వేలు
ప్రజలు అందించిన	
వినతిపత్రాలు	- 4,257
పరిష్కారమైనవి	- 4,008
పరిష్కారం కానివి	- 249

కల్వర్టు నిర్మించారు



'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా మా కాలనీకి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వచ్చారు. తోటల్లోకి వెళ్లేందుకు కల్వర్టు లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పిన వెంటనే నిధులు మంజూరు చేయించి నిర్మించారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్య ఈ కార్యక్రమం ద్వారా పరిష్కారమైంది.

– జి.పెంచలయ్య, గిరిజన రైతు, లింగంపల్లితోపు

ఇంటి స్థలాలు ఇచ్చారు



చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించారు. అధికారుల ద్వారా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుని ఇళ్ల స్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి చేసిన మేలును మరచిపోలేం.

– జి.సుధాకర్, ముదిగేడు

క్లుప్తంగా

రాష్ట్రంలో జనరంజక పాలన



మాట్లాడుతున్న రజత్‌కుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: రాష్ట్రంలో జనరంజక పాలన అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇందుకూరుపేటలో ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, ఇందుకూరుపేట కోఆపరేటివ్ రూరల్ బ్యాంక్ చైర్మన్ గునుపాటి సురేష్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచార ం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని, ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రజాభిమానం చూరగొన్నారని తెలిపారు. నిత్యం ప్రజల్లో ఉండే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని కోవూరు ఎమ్మెల్యేగా, వేణంబాక విజయసాయిరెడ్డిని నెల్లూరు ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గురజాల బుజ్జిబాబు, మేనాటి ప్రసాద్‌రెడ్డి, రవికుమార్, భాను చంద్రశేఖర్, వాసు పాల్గొన్నారు.

పాడి రైతులకు మెరుగైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య

కోవూరు: గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులకు మెరుగైన సేవలు అందించడమే కాకుండా మేలుజాతి పశు ఉత్పత్తిపై వారిలో అవగాహన పెంచేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పశు వైద్యశాల సమావేశ మందిరంలో శుక్రవారం కోవూరు, విడవలూరు మండలాలకు సంబంధించిన పశుసంవర్ధకశాఖ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లక్ష్యాలు నూరుశాతం పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా రైతుభరోసా కేంద్రాల పరిధిలో ఉన్న పాడి రైతులకు సీజన్‌లో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్యులు షబానా, ప్రీతి సాల్మన్, సజ్జాద్ అహ్మద్, పశుసంవర్ధకశాఖ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న ఎండ తీవ్రత



మాట్లాడుతున్న తహసీల్దార్ చిరంజీవి

మనుబోలు: గత కొన్ని రోజులుగా ఎండ తీవ్రత బాగా పెరిగిందని, ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ చిరంజీవి సూచించారు. శుక్రవారం ఆయన మనుబోలులోని తన కార్యాలయంలో మాట్లాడుతూ గత రెండు, మూడు రోజులుగా మనుబోలులో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోందని తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. చిన్నారులు, వృద్ధులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.

హరివిల్లు ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం రేపు

నెల్లూరు(బృందావనం): శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని హరివిల్లు ఉగాది పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని పురమందిరంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నట్లు 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, హరివిల్లు క్రియేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు దోర్నాల హరిబాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను గాంధీబొమ్మ సమీపంలోని 25 కళాసంఘాల చాంబర్‌లో శుక్రవారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడుతూ 25 కళాసంఘాల పర్యవేక్షణలో, హరివిల్లు క్రియేషన్స్ ఆధ్వర్యంలో గత పదేళ్లుగా ఉగాది పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది హరివిల్లు ఉగాది ఆత్మీయ పురస్కారాన్ని సినీనటుడు ఒంగోలుగిత్త ఫేమ్ కిషోర్‌దాస్‌కు అందజేయనున్నట్లు వెల్లడించారు. హరివిల్లు క్రియేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు దోర్నాల హరిబాబు మాట్లాడుతూ వివిధ రంగాలకు చెందిన మరో పది మందిని ఉగాది పురస్కారాలతో సత్కరించనున్నట్లు తెలిపారు. 25 కళా సంఘాల కన్వీనర్లు అమీర్‌జాన్, నేదురుమల్లి హరనాథ్‌రెడ్డి, భాస్కర్, వనారస లక్ష్మీకాంత్‌బాబు, దోర్నాల శ్రీనివాసరావు, డ్యాన్స్ మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జహీర్, కార్యదర్శి జనార్దన్, నెల్లూరు నారాయణబాబు, సునీల్‌రెడ్డి, సినీ స్టంట్ మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదినారాయణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే

కోవూరు: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం కోవూరు పంచాయతీ పరిధిలోని రైల్వే రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తుంటే చంద్రబాబు వారి సేవలను అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. మండుటెండలో వృద్ధులు, దివ్యాంగులు సచివాలయాలకు వచ్చి పింఛన్లు తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రానున్న ఎన్నికల్లో కోవూరు ఎమ్మెల్యేగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు ఎం.సౌందర్య, నేతలు సంపత్, జగదీష్, మోహన్, రమేష్, రామయ్య, గణేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'గండికోట'కు సన్మానం



ప్రశంసాపత్రం అందుకుంటున్న సుధీర్‌కుమార్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్న బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్‌ను శుక్రవారం వెంకటాచలంలోని తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో జరిగిన కవి సమ్మేళనంలో డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ సన్మానించారు. ఈ సందర్భంగా సుధీర్‌కుమార్‌కు ప్రశంసాపత్రం అందజేసి ఆయన సేవలను కొనియాడారు.

వలంటీర్లను తొలగించడం దుర్మార్గం



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో వీరి చలపతిరావు

కోవూరు(కొడవలూరు): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పాన్ని నెరవేర్చేందుకు తమవంతుగా ప్రజలకు చేస్తున్న సేవలను చూసి ఓర్వలేని చంద్రబాబు ఎలక్షన్ కమిషన్‌కి నిమ్మగడ్డ రమేష్ ద్వారా ఫిర్యాదు చేయించి తమను బాధ్యతల తొలగించడం దుర్మార్గమని కొడవలూరు మండలం నార్తురాజుపాళేనికి చెందిన వలంటీర్లు పేర్కొన్నారు. వీరంతా ఇప్పటికే వలంటీర్ పోస్టులకు రాజీనామా చేశారు. శుక్రవారం వారు డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు ఆధ్వర్యంలో కొడవలూరులో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి వీరి చలపతిరావు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందాల్సిన లబ్ధిని పారదర్శకంగా వారికి అందించే అవకాశాన్ని మహాభాగ్యంగా భావించామని, నిస్వార్థ సేవలకులైన తమను చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ మానసిక వేదనకు గురిచేశారని మండిపడ్డారు. తాము వలంటీర్ పోస్టులకు రాజీనామా చేసి జగనన్నకు మద్దతు తెలుపుతున్నామన్నారు. వీరి చలపతిరావు మాట్లాడుతూ శనివారం కావలిలో జరగనున్న మేమంతా సిద్ధం సభకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం ఉదయం నార్త్‌రాజుపాళెం ఆంజనేయస్వామి విగ్రహం వద్ద సీఎంకు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశామని, మహిళలంతా సీఎంకు స్వాగతం పలికేందుకు తరలిరావాలని కోరారు.

సిద్ధం సభకు తరలిరండి

కావలిలో జరిగే మేమంతా సిద్ధం సభకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్ నెల్లూరు నుంచి కోవూరు మీదుగా వెళ్తుందని శనివారం ఉదయం ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు కోవూరు జాతీయ రహదారి సాయిబాబా గుడి వద్ద ఏర్పాట్లు చేశామని డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రైతులు, డ్వాక్రా సంఘాలను ముంచింది చంద్రబాబే

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



బిరదవోలులో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: గతంలో రైతులను, డ్వాక్రా సంఘాల మహిళలను ముంచింది చంద్రబాబేనని, మళ్లీ ఇప్పుడు అధికారంలోకి వచ్చేందుకు చెప్పిన అబద్ధం చెప్పకుండా చెబుతున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని పార్లపల్లి, చెర్లోపల్లి, బిరదవోలు, ముత్యాలపేట, కల్యాణపురం, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేయలేమని స్వయాన అప్పటి మంత్రి పరిటాల సునీత అసెంబ్లీ సాక్షిగా వెల్లడించిన విషయాన్ని గుర్తుచేశారు. చంద్రబాబును రైతు రుణమాఫీపై మీడియా ప్రతినిధులు అడిగితే ఇంకేం రుణమాఫీ.. వన్‌టైమ్ సెటిల్మెంట్ చేశామంటూ బుకాయించినట్లు గుర్తుచేశారు. బీజేపీ, జనసేనలతో పొత్తుపెట్టుకున్న చంద్రబాబు మళ్లీ అధికారం చేజిక్కించుకుని ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలని ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు వలంటీర్ల సేవలను అడ్డుకోవడం వల్లనే అవ్వాతాతలకు ఇబ్బందులు వచ్చాయని తెలిపారు.

అల్లీపురం రెడ్డికి ఓటమి తప్పదు

నెల్లూరు రూరల్ నియోజకవర్గ వాస్తవ్యుడు, అల్లీపురం రెడ్డి సోమిరెడ్డి ముచ్చటగా మూడోసారి తన చేతిలో ఓటమి తప్పదని మంత్రి కాకాణి పేర్కొన్నారు. టీడీపీ కార్యకర్తలకే కండువాలు వేసి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నట్లు సోమిరెడ్డి బిల్డప్ ఇస్తున్నారన్నారు.

రైతులు అడగకుండానే సాగునీరిచ్చాం

బిరదవోలు, పార్లపల్లి పంచాయతీలో ఉన్న గ్రామాలకు కండలేరు ఎడమకాలువ ద్వారా రైతులు అడగకుండానే సాగునీరు సరఫరా చేశామని మంత్రి కాకాణి తెలిపారు. ప్రభుత్వం ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడం ద్వారానే అన్నదాతలు ఆర్థికంగా నిలదొక్కుకున్నారని తెలిపారు. సోమిరెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో మిల్లర్ల వద్ద ముడుపులు తీసుకోవడంతో రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరలు లభించక అన్యాయమైపోయిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌రెడ్డి, కోనం చినబ్రహ్మయ్య, రావుల దశరథరామయ్యగౌడ్, వెన్నపూస దయాకర్‌రెడ్డి, నీలి పెంచలయ్య, బత్తల పెంచలరెడ్డి, ఆకుల గంగిరెడ్డి, బడుగు శ్రీనివాసులు, బడుగు శ్రీహరి, రావుల ఇంద్రసేన్‌గౌడ్, వెన్నపూస శివారెడ్డి, నాగేళ్ల గోపాలయ్య, రామయ్య, ముడి సుధాకర్‌రెడ్డి, లక్ష్మయ్య, లక్ష్మణరెడ్డి, ఆకుల గణేష్‌రెడ్డి, రావుల నారాయణ, అవ్వారి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆనందం.. ఆరోగ్యం

- పట్టణవాసులకు వరం బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కు
- ఆనందం వ్యక్తం చేస్తున్న బుచ్చిరెడ్డిపాళెం ప్రజలు



పచ్చదనంతో కళకళలాడుతున్న బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కు బుచ్చిరెడ్డిపాళెం వాసులకు ఆహ్లాదం, ఆనందంతోపాటు ఆరోగ్యానికి నిలయమైంది. ఉదయం, సాయంత్రం స్థానిక ప్రజలు పార్కులో సేద తీరుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పార్కు ఎదురుగా ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారు పార్కులో సేద తీరుతున్నారు. పార్కులో చిన్నారులు ఆడుకునేందుకు వివిధ ఆట వస్తువులతోపాటు వాకర్స్‌కు అనుకూలంగా వాకింగ్ ట్రాక్, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. పచ్చదనం కోసం వివిధ రకాల మొక్కలు నాటి అందంగా తీర్చిదిద్దారు. దీంతో ప్రతి రోజూ చిన్నారులు, పెద్దల తాకిడితో పార్కు సందడిగా కనిపిస్తోంది.

రూ.కోటి నిధులు వెచ్చించి..

2019 సంవత్సరానికి ముందు మేజర్ పంచాయతీగా ఉన్న బుచ్చిరెడ్డిపాళెం వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నగర పంచాయతీగా రూపుదాల్చింది. దీంతో బుచ్చి పట్టణం అన్ని రకాలుగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో నుడా నిధులు రూ.కోటి వెచ్చించి పార్కు నిర్మాణం, వివిధ మౌలిక సదుపాయాలు తదితరు పనులు చేయించారు. గత సంవత్సరం అక్టోబరులో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ తదితరులు పార్కును ప్రారంభించి పట్టణవాసులకు కానుకగా ఇచ్చారు.

బుచ్చివాసుల ఆనందం

గత టీడీపీ ప్రభుత్వం పట్టణ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుతోపాటు బుచ్చి అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ప్రజలు తెలిపారు. పట్టణంలో మౌలిక వసతుల కల్పనతోపాటు పార్కుల నిర్మాణం, పచ్చదనం పెంచడం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు.



పార్కులో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్



పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన పరికరాలు


ప్రభుత్వ సహకారం బాగుంది



పార్కు అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అన్ని రకాలుగా సహకారం అందించింది. ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచనలతో పట్టణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పార్కును తీర్చిదిద్దాం. బుచ్చి ప్రజలు పార్కులో ఆనందంగా గడిపేందుకు అవసరమైన సౌకర్యాలన్నీ కల్పించాం.

– మోర్ల సుప్రజ, చైర్‌పర్సన్, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ

ఎమ్మెల్యే ప్రసన్నకు ధన్యవాదాలు



బుచ్చిరెడ్డిపాళెంలో బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పార్కు అభివృద్ధికి కృషి చేసిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు. పట్టణ ప్రజల సంతోషమే ధ్యేయంగా నగర పంచాయతీ కౌన్సిల్ పనిచేస్తోంది.

– ప్రమీలమ్మ, కౌన్సిలర్, బుచ్చిరెడ్డిపాళెం

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



పొదలకూరు: విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నివాళి



కోవూరు: బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న నిరంజన్‌బాబురెడ్డి తదితరులు

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో శుక్రవారం బాబూ జగజ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి వైస్ ఛాన్సలర్ జీఎం సుందరవల్లి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్ కుమార్‌బాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, ప్రోగ్రాం అధికారి విద్యా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

పొదలకూరు: స్వాతంత్య్ర సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్‌సాహెబ్, అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, కార్యదర్శి కేఎల్ నారాయణ, ట్రెజరర్ యు.మస్తానయ్య, సభ్యులు పాల్గొన్నారు.

కోవూరులో..

కోవూరు: మాజీ ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శుక్రవారం కోవూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్య్ర ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు అందాలనే లక్ష్యంగా సమసమాజ స్థాపన కోసం కృషి చేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకుడు చిరంజీవి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీటీసీ సభ్యులు వేణుగోపాల్, అంజన్‌రావు, సచివాలయ కన్వీనర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలం: జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ సుందరవల్లి తదితరులు